సాక్షి వరంగల్

సోమవారం । 25 । నవంబర్ । 2024



ఇక.. అంతరాయానికి చెక్

కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా టీజీ ఎన్పీడీసీఎల్ ముందుకు సాగుతోంది.

- 8లో ▸



న్యాయబద్ధంగా వర్గీకరణ చేపట్టాలి

వర్గీకరణను న్యాయబద్ధంగా చేపట్టాలని ఎంహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు దాస్ రామ్‌నాయక్ డిమాండ్ చేశారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
$27^0/14^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదవుతాయి. రాత్రి చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

డిసెంబర్ 8న వరంగల్ క్రికెట్ సంఘం ఎన్నికలు

వరంగల్ స్పోర్ట్స్: వరంగల్ క్రికెట్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికలు డిసెంబర్ 8న నిర్వహించేందుకు తీర్మానించినట్లు ఎన్నికల అధికారి గోపు సమ్మిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ హంటర్‌రోడ్‌లోని జిల్లా రైస్ మిల్లర్ల సంఘం భవనంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు జరిగే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ఈనెల 25 నుంచి 27 వరకు నామినేషన్ పత్రాలు ఇస్తామని పేర్కొన్నారు. 28 నుంచి 30వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, డిసెంబర్ 2న స్క్రూటినీ, 3న నామినేషన్ల ఉపసంహరణ, 4వ తేదీన తుది జాబితా విడుదల చేస్తామని తెలిపారు. డిసెంబర్ 8వ తేదీన 3 నుంచి 4 గంటల వరకు ఓట్ల లెక్కింపు ఫలితాలు విడుదల చేయనున్నట్లు వివరించారు.

నేడు గ్రేటర్ గ్రీవెన్స్

వరంగల్ అర్బన్: వరంగల్ బల్దియా ప్రధాన కార్యాలయం ఆవరణలోని మెప్మా భవన్‌లో సోమవారం(నేడు) గ్రీవెన్ గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి రాత పూర్వకంగా దరఖాస్తులు స్వీకరిస్తామని, ప్రజలు సమస్యల పరిష్కారానికి ఈ వేదికను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వార్డు పక్కనే బయో మెడికల్ వేస్ట్



ఎంజీఎం: ఎంజీఎం అధికారుల నిర్లక్ష్యం మరోసారి తేటతెల్లమైంది. ఆస్పత్రిలోని ఓ వార్డు పక్కనే ఆదివారం వినియోగించిన ఇంజక్షన్ బాటిళ్లు, నీడిల్స్ పడేయడంతో రోగులు ఆందోళన చెందారు. ఆస్పత్రిలోని మెడికల్ బయో వేస్టేజీని తరలించకుండా వదిలేయడంతో చికిత్స కోసం వచ్చిన వారి జబ్బులు ఎలా నయమవుతాయని పలువురు మండి పడుతున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని రోగులు, వారి బంధువులు కోరుతున్నారు.

94 శాతం హాజరు

విద్యారణ్యపురి: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్) అర్హత పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. హనుమకొండలో మూడు సెంటర్లు, పరకాలలో ఒక సెంటర్ కేటాయించగా.. మొత్తం 628 మంది విద్యార్థులకు 593 మంది(94శాతం) హాజరైనట్లు డీఈఓ వాసంతి తెలిపారు.

భాషా పండితుల సమస్యల పరిష్కారానికి కృషి



విద్యారణ్యపురి: భాషాపండితుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని వరంగల్‌పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్(ఆర్‌యూపీపీటీ) హనుమకొండ జిల్లా శాఖ ఆధ్వర్యాన ఆదివారం జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన ఆత్మీయ అభినందన సభలో ఆయన మాట్లాడారు. భాషాపండితుల సమస్యలపై సంఘం ప్రతినిధులు వస్తే సీఎంతో మాట్లాడిస్తానని, ముఖ్యమంత్రి కూడా పరిష్కరించడానికి సుముఖంగానే ఉన్నారని పేర్కొన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ.అబ్దుల్లా మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల్లో తెలుగు, హిందీ పండితులను నియమించాలని, పదోన్నతులు లభించక మిగిలిపోయిన 1,000 మంది భాషాపండితులకు పదోన్నతులు కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాంతికృష్ణ మాట్లాడుతూ భాషలు సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకలని పేర్కొన్నారు. అనంతరం పదోన్నతులు పొందిన భాషాపండితులను సన్మానించారు. సమావేశంలో సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సొల్లేటి లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి ఫారూఖ్ సాదత్‌అలీ, బాధ్యులు నాగుల భిక్షపతి, దాసరి తిరుపతయ్య, వనపర్తి గంగాధర్, బత్తిని వేణుగోపాల్, కుమారస్వామి, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

నల్లబెల్లి మండల కేంద్రంలో పైపులైన్ లీకవుతుండడంతో రోడ్డుపై వృథాగా పోతున్న తాగునీరు



తిరోగమనం!

గ్రామ పంచాయతీల్లో కుంటుపడిన అభివృద్ధి

- నిలిచిపోయిన పైప్‌లైన్ లీకేజీల మరమ్మతులు
- అప్పులపాలైన గ్రామ కార్యదర్శులు
- బిల్లులు ఇప్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి
- జిల్లాలో 323 గ్రామ పంచాయతీలు

నల్లబెల్లి: నిధుల లేమితో గ్రామపంచాయతీలు తిరోగమన బాట పడుతున్నాయి. అభివృద్ధి పనులు, మరమ్మతులకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. సర్పంచ్‌ల పదవీ కాలం ఈ ఏడాది ఫిబ్రవరి 2న ముగిసింది. గ్రామ పంచాయతీల్లో వెంటనే అత్యవసరమైన పనులు చేపట్టాలని 10 నెలల క్రితం ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. జిల్లాలోని 11 గ్రామీణ మండలాల్లో 323 గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నామమాత్రంగా అందిస్తున్న నిధులు సరిపోవట్లేదు. గ్రామాల్లో ఆదాయ వనరులు లేకపోవడంతో పారిశుద్ధ్య పనులు, కార్యాలయాల నిర్వహణ, ఇతరత్రా ఖర్చులకు కష్టంగా మారుతోంది. అభివృద్ధి పనులు సైతం నిలిచిపోయాయి.

ఆరు నెలలుగా పైపులైన్ లీకేజీ..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామ పంచాయతీలకు నిధులు కేటాయించకపోవడంతో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. మండల కేంద్రంలోని లెంకాలపల్లి క్రాస్‌రోడ్డులో ఆరు నెలల క్రితం తాగునీటి పైపులైన్ పగిలి లీకేజీతో నీరు వృథాగాపోతోంది. పైపులైన్ లీకేజీకి మరమ్మతులు చేయాలంటే రూ.లక్షన్నర వరకు ఖర్చవుతుంది. నిధులు లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శి పైపులైన్ లీకేజీకి మరమ్మతులు చేపట్టడం లేదు.



ఈ ఫొటోలో ఉన్న వ్యక్తి నల్లబెల్లి మండలం మామిండ్ల వీరయ్యపల్లి పంచాయతీ కార్యదర్శి బైరబోయిన సుధాకర్. గ్రామాభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుమారు రూ.8 లక్షల వరకు నిధులు అందించాల్సి ఉంది. ఇప్పటి వరకు రూ.77,090 మాత్రమే విడుదల చేశాయి. ప్రత్యేకాధికారి ఆదేశాల మేరకు అత్యవసర పరిస్థితుల్లో సుమారు రూ.1.50 లక్షలు అప్పు చేసి గ్రామంలో పనులు చేయించారు. నిధులు విడుదల చేయాలని ఇప్పటికే ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. కానీ.. ఇంతవరకు రూపాయి కూడా రాలేదు. ఇలాంటి పరిస్థితి సుధాకర్ ఒక్కడిదే కాదు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శులది.

ఏమీ చేయలేని పరిస్థితి..

గ్రామ పంచాయతీల్లో నిధులు లేకపోవడంతో స్పెషల్ ఆఫీసర్లు ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడింది. పారిశుద్ధ్యం, పైపులైన్ లీకేజీల మరమ్మతు పనులు నిలిచాయి. అత్యవసర పరిస్థితుల్లో అధికారుల ఒత్తిడితో అప్పులు చేస్తూ పంచాయతీ కార్యదర్శులు అభివృద్ధి పనులు చేస్తున్నారు. పారిశుద్ధ్యం, మోటార్ల మరమ్మతు, ట్రాక్టర్ డీజిల్ తదితర ఖర్చులకు వినియోగిస్తున్నారు. బిల్లుల విడుదలకు కృషి చేయాలని పంచాయతీ అధికారులకు మొరపెట్టుకుంటే ప్రభుత్వం ఇచ్చినప్పుడు తీసుకోండి.. అప్పటి వరకు మేం చేసేది ఏంలేదని దాటవేస్తున్నారని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అప్పులు చేసి పనులు చేయిస్తున్నాం..



నల్లబెల్లి గ్రామ పంచాయతీకి ప్రభుత్వం నెలకు రూ.4.50 లక్షల నిధులు ఇవ్వాల్సి ఉంది. 10 నెలల్లో ఇప్పటి వరకు కేవలం రూ.2.29 లక్షలు ఇచ్చింది. ఇందులో రూ.1.04 లక్షలు మల్టీపర్పస్ వర్కర్ల వేతనాలు, రూ.30 వేలు కరెంట్ బిల్లు, రూ.75 వేలు స్వచ్ఛదనం-పచ్చదనం కింద ఖర్చు చేయాలని నిర్దేశించింది. కరెంట్ బిల్లు, పచ్చదనం-స్వచ్ఛదనం నిధులను అధికారులు ఫ్రీజ్ చేశారు. ట్రాక్టర్ డీజిల్ ఖర్చులు, బ్లీచింగ్ పౌడర్, పారిశుద్ధ్య పనులు, గుంతలు పూడ్చడం, మోటార్లు, స్టార్టర్లు కాలితే మరమ్మతులు చేయించడం, పైపులైన్ల మరమ్మతులు తదితర పనులు చేయించాల్సి ఉంది. అధికారులు ఒత్తిడి చేస్తుండడంతో ప్రజల అవసరాల మేరకు అప్పు చేసి పనులు చేయిస్తున్నాం. ప్రభుత్వం నిధులు విడుదల చేయాలి.

- సాధనపల్లి ధర్మేందర్, తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడు

నిధులు రావాల్సి ఉంది..



గ్రామ పంచాయతీలకు నిధులు రావాల్సి ఉంది. పారిశుద్ధ్య పనులు, మరమ్మతు పనులు చేపట్టేందుకు గ్రామ పంచాయతీ జనరల్ ఫండ్‌ను వాడుకోవాలని సూచించాం. నిధులు లేని పంచాయతీల సమస్యలను పరిష్కరించేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

- కుంట రాజీరుకుమార్, డీఎల్‌పీఓ, నర్సంపేట

విద్యార్థుల ఎదుగుదలకు ఆహారం ముఖ్యం

- కలెక్టర్ డాక్టర్ సత్యశారద
- వంచనగిరిలో జిల్లా స్థాయి వంటల పోటీలు



వంటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందిస్తున్న కలెక్టర్ సత్యశారద

గీసుకొండ: విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి వారు తీసుకునే ఆహారం ముఖ్య భూమిక పోషిస్తుందని కలెక్టర్ సత్యశారద అన్నారు. ఆదివారం మండలంలోని వంచనగిరి కస్తూర్బా గాంధీ విద్యాలయంలో జిల్లాలోని కేజీబీవీల్లో వంట చేస్తున్న నిర్వాహకులకు జిల్లా స్థాయిలో వంటల పోటీలు నిర్వహించారు. ఈపోటీలను కలెక్టర్ పరిశీలించి సూచనలు చేశారు. జిల్లాలోని 13 మండలాల నుంచి పోటీల్లో పాల్గొనడానికి వచ్చిన వంటల నిర్వాహకులు వండిన ఆహార పదార్థాలను కలెక్టర్ రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. రుచికరంగా వంటలు చేసిన ఖానాపురం కేజీబీవీకి చెందిన సుశీలకు ప్రథమ బహుమతి, వంచనగిరి కేజీబీవీకి చెందిన రేణుకకు ద్వితీయ, నల్లబెల్లి కేజీబీవీకి చెందిన స్వప్నకు తృతీయ బహుమతి అందించారు. న్యాయ నిర్ణేతలుగా న్యూట్రిషియన్ డాక్టర్ శ్రీలత, హెచ్‌ఎం నర్సింహాచార్యులు వ్యవహరించగా.. డీఈఓ మామిడి జ్ఞానేశ్వర్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి, కేజీబీవీ కో-ఆర్డినేటర్ ఫ్లోరెన్స్, డీసీఈబీ సెక్రటరీ కృష్ణమూర్తి, వంచనగిరి కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ హిమబిందు, నిరంజన్‌రెడ్డి, ఎంఈఓలు పాల్గొన్నారు.

నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురావాలి..

రైతులు తాము పండించిన వరి ధాన్యాన్ని తాలు,చెత్త లేకుండా చేసి కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని కలెక్టర్ సత్యశారద అన్నారు. గీసుకొండ మండల కేంద్రంలో రైతు పాకనాటి సురేశ్ వ్యవసాయ క్షేత్రంలో కంబైన్డ్ హార్వెస్టర్‌తో చేపట్టిన వరి కోతలను ఆమె పరిశీలించారు. అనంతరం గీసుకొండలోని పీఏసీఎస్ వద్ద వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాట్లను పరిశీలించారు. ఆమె వెంట జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, ఏడీ హరిప్రసాద్‌బాబు, ఏఈఓ కావ్య, డైరెక్టర్ కోల ప్రదీప్, రైతు వజ్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్ల తనిఖీ..

సంగెం: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, ఎస్టీ బాలుర హాస్టల్‌ను కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదివారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా హాస్టల్ మొత్తం తిరిగి సమస్యలు తెలుసుకున్నారు. కేజీబీవీ సిబ్బంది తాగునీటి సమస్య, కిటికీలకు మెష్ డోర్లు, వాష్ ఏరియా తదితర సమస్యల్ని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. దీనికి సానుకూలంగా స్పందించిన కలెక్టర్ త్వరలో ప్లాంట్ అమర్చనున్నట్లు తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని ఎస్టీ హాస్టల్ స్టోర్‌రూంను, రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేకాధికారి నీలిమ, సీఆర్టీ శిరీష పాల్గొన్నారు.

రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు

పర్వతగిరి: ఈనెల 26న 75వ భారత రాజ్యాంగ దినోత్సవం, 28న మహాత్మా జ్యోతిరావుపూలే 134వ వర్ధంతి, డిసెంబర్ 6న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 68వ వర్ధంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మాంకాల యాదగిరి అన్నారు. ఈమేరకు పర్వతగిరి మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఆదివారం అంబేడ్కర్ యువజన సంఘం మండల కన్వీనర్ వల్లందాస్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత మహనీయులను ఆదర్శంగా తీసుకొని సమాజాన్ని చైతన్య పర్చాలన్నారు. కార్యక్రమంలో పర్వతగిరి అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్, జిల్లా ధర్మయ్య, దండంపెల్లి సైదులు, హర్షం దర్గాస్వామి, బొట్ల వెంకటేశ్వర్లు, బానోతు భాస్కర్‌నాయక్, రామావత్ దీప్లానాయక్, బొట్ల ప్రభాకర్, మురళి, యాకోబ్, కుమారస్వామి, గొలుసుల యాకయ్యయాదవ్, దస్రునాయక్, తదితరులు పాల్గొన్నారు.

సర్వేలో డేటా ఎంట్రీ కీలకం

- కలెక్టర్లతో మంత్రి మల్లు భట్టివిక్రమార్క



సమీక్షలో కలెక్టర్ సత్యశారద, అధికారులు

వరంగల్: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో డేటా ఎంట్రీ ఎంతో కీలకమైనది.. డోర్‌లాక్, వలస వెళ్లిన వారి వివరాలు ఫోన్ కాల్ ద్వారా సేకరించి నమోదు చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. ఆదివారం ఆయన జార్ఖండ్ రాజధాని నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో సమీక్షించారు. అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ జిల్లాలో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో సేకరించిన సమాచారాన్ని ఎన్యుమరేటర్లు డేటా ఎంట్రీ ఆపరేటర్ల వద్ద ఉండి పొరపాట్లు లేకుండా నమోదు చేయించాలన్నారు. ఏదైనా తేడా వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో స్టిక్కరింగ్ వేసిన ఇళ్లకు సర్వే సిబ్బంది రాలేదని భావిస్తే గ్రామ కార్యదర్శిని సంప్రదించాలని సూచించారు. వీసీలో రాష్ట్ర ఆర్థిక, ప్రణాళికశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశ్వర్లు, సీపీఓ గోవిందరాజన్, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 2,76,846 గృహాల్లో సర్వే పూర్తి

వరంగల్ జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కులగణన సర్వే ఆదివారంతో పూర్తయ్యింది. జిల్లాలో మొత్తం 2,87,441 గృహాలు ఉండగా.. 2,76,846 గృహాల్లో ఎన్యుమరేటర్లు సర్వే పూర్తి చేసినట్లు (96.03 శాతం) పూర్తి చేసినట్లు జిల్లా యంత్రాంగం ఒక ప్రకటనలో తెలిపింది. గ్రామీణ ప్రాంతాల్లో 1,58,376, పట్టణ ప్రాంతాల్లో 1,18,470 గృహాల్లో సర్వే పూర్తి చేశారు.

పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి

- ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి
- యూటీఎఫ్ 6వ మహా సభ




మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

కాళోజీ సెంటర్: పెండింగ్ బిల్లులు, డీఏలను వెంటనే మంజూరు చేయాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. ఆదివారం యూటీఎఫ్ జిల్లా 6వ మహా సభ వరంగల్ కార్యాలయంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ప్రాతినిథ్యం వహిస్తున్న సంఘం టీఎస్‌యూటీఎఫ్ అన్నారు. పీఆర్సీ అమలులో తాత్సారం తగదని వెంటనే నివేదిక తెప్పించుకుని అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల్లో అశాస్త్రీయ ఆలోచనల్ని పెంపొందించేలా ఉన్న ఎన్ఈపీ-20ని రద్దు చేయలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.సోమశేఖర్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి మరోసారి గెలిపించాలని కోరారు. సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి మాల్లారెడ్డి, జిల్లా అధ్యక్షుడు తాటికాయల కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి సుజన్ ప్రసాద రావు, వాయిస్ ఆఫ్ తెలంగాణ టీచర్స్ సంపాదక వర్గ సభ్యురాలు విద్యాదేవి, సంఘం సీనియర్ నాయకులు సదానంద్, సదాశివరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు దామోదర్, అన్నాదేవి, కోశాధికారి రవైఫ్, హనుమకొండ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి పెండెం రాజు, కోశాధికారి కిరణ్‌కుమార్, జిల్లా కార్యదర్శులు పాక శ్రీనివాస్, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

'న్యాస్'కు సిద్ధం

- డిసెంబర్ 4న జాతీయ సాధన సర్వే
- 3, 6, 9 తరగతుల విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ
- జిల్లాలో 106 పాఠశాలల్లో 'న్యాస్' టీచర్లకు పూర్తయిన ప్రత్యేక శిక్షణ



2021 సర్వే ప్రకారం..		
సబ్జెక్టు	జాతీయ సగటు	తెలంగాణ
తెలుగు భాష	62	48
గణితం	57	44
పరిసరాల విజ్ఞానం	57	45

కాళోజీ సెంటర్: దేశవ్యాప్తంగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను అంచనా వేసేందుకు, ఏక కాలంలో జాతీయ సాధన సర్వే (న్యాస్) పేరిట పరీక్ష నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. సాధారణంగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను గుర్తించనున్న నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేకు జిల్లాలోని విద్యార్థులను సిద్ధం చేస్తున్నారు. ఈ సర్వే జాతీయ స్థాయిలో నిర్వహించనున్నారు. సర్వేను ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల్లో నిర్వహించనున్నారు. మూడేళ్లకోసారి, సర్వే 3, 6, 9 తరగతుల విద్యార్థుల గుణాత్మక విద్యా సాధనలోని ప్రగతిని అంచనా వేసేందుకు హిందీ మినహా అన్ని సబ్జెక్టుల్లో నిర్వహిస్తారు. పాఠశాల వసతులు, బోధనా సిబ్బంది, ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణ, బోధనాభ్యసన ప్రక్రియ వంటి కార్యక్రమాలను కూడా ఇందులో పరిశీలించి వివరాలు నమోదు చేస్తారు.

సర్వే సాగుతుందిలా..

- న్యాస్‌లో మూడు రకాల ప్రశ్నావళి ఉంటుంది.
- పీ-క్యూ (పబ్లిక్ క్వశ్చన్స్) విద్యార్థుల ప్రశ్నావళి
- ఎస్-క్యూ (స్కూల్ క్వశ్చన్స్) పాఠశాల ప్రశ్నావళి
- టీ-క్యూ (టీచర్స్ క్వశ్చన్స్) ఉపాధ్యాయుల ప్రశ్నావళి

పైన పేర్కొన్న ప్రశ్నావళుల ఆధారంగా ప్రస్తుత పరిస్థితులను బోధనపరంగా, విద్యార్థుల ప్రగతి పరంగా, మౌలిక వసతుల పరంగా, బోధన సిబ్బంది పరంగా నివేదిక రూపొందిస్తారు. ఈ సర్వేలోని ఫలితాల ఆధారంగా నూతన బోధనాభ్యసన ఫలితాల రూపకల్పనకు అవకాశం ఉంటుంది. అంతేకాకుండా.. సిబ్బంది అవసరాలు, అదనపు బోధకుల (టీచర్స్) నియామకం, అదనపు వసతుల ఏర్పాటుపై ఒక నిర్ణయాన్ని తీసుకునే అవకాశం ఏర్పాటవుతుంది. జాతీయ సగటులో మన రాష్ట్రం, జిల్లా గుణాత్మక విద్యాసాధనలో ఏ స్థాయిలో ఉంది? మరింత మెరుగైన స్థానాన్ని పొందాలంటే ఏరకమైన నూతన విధానాల్ని అవలంబించాలనే అంశాలపై దృష్టి సారించవచ్చు అనే కోణంలో సన్నద్ధమవుతున్నారు. బోధనాభ్యసన ప్రక్రియల సర్వేలో ప్రాథమిక స్థాయిలో తెంగాణ-21లో నిర్వహించిన నేషనల్ అచీవ్‌మెంట్ ఆధారంగా ఇలా ఉన్నాయి.

2021 నవంబర్ లో నిర్వహించిన నాస్(ఎన్ఏఎస్) ఆధారంగా తెలంగాణ రాష్ట్రం సగటు పీక్యూ, ఎస్క్యూ, టీక్యూలలో 59 ఉంది. సర్వే ప్రకారం మన తెలంగాణ రాష్ట్రం దేశంలో చివరి 5 రాష్ట్రాల్లో ఒకటిగా ఉంది. చివరి నుంచి 5వ స్థానంలో ఉంది. వరంగల్ జిల్లా మాత్రం 24వ స్థానంలో ఉంది. ఇప్పుడు శిక్షణ పొందిన కాంప్లెక్స్ హెచ్‌ఎం, ఉపాధ్యాయుల ద్వారా ఎన్ఏఎస్‌కు సరైన దిశలో సమాయత్తపర్చి వరంగల్ జిల్లాను తెలంగాణలో ముందు వరుసలో ఉంచే ప్రయత్నం కొనసాగుతోంది,

సిద్ధమవుతున్న పాఠశాలలు



ఎన్‌సీఈఆర్టీ ఆదేశాల మేరకు డీఈఓ సూచనల ప్రకారం డిసెంబర్ 4న నిర్వహించనున్న న్యాస్ పరీక్షకు సర్వం సిద్ధం చేస్తున్నాం. ఇందులో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 3, 6, 9వ తరగతి విద్యార్థులు ఉంటారు. జిల్లాలో ఎంపిక చేసిన 106 పాఠశాలల విద్యార్థులు డిసెంబర్ 4న న్యాస్ పరీక్ష రాస్తారు.

- ఉంద్రాతి సుజన్ తేజ, అకడమిక్ మానిటరింగ్ అధికారి

నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేకు సిద్ధం చేస్తున్నాం..



విద్యార్థుల సామర్థ్యాల అంచనా గురించి రెండేళ్లకోసారి జరిగే నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలో వరంగల్ జిల్లాను మొదటి వరుసలో ఉంచేందుకు ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చి విద్యార్థులను సిద్ధం చేస్తున్నాం. ఎన్ఏఎస్‌కు ప్రత్యేక ప్రశ్నావళి రూపొందించి విద్యార్థుల సామర్థ్యాలను రాబట్టడం జరుగుతుంది. ఆసర్వే డిసెంబర్ 4న నిర్వహిస్తాం. కాబట్టి అప్పటి వరకు విద్యార్థులను ఉపాధ్యాయులు సిద్ధం చేస్తారు. గతంకంటే మెరుగైన స్థానంలో నిలబెడతాం.

- మామిడి జ్ఞానేశ్వర్, డీఈఓ

మహాకాళేశ్వరుడిగా రుద్రేశ్వరుడు



హన్మకొండ కల్చరల్: కార్తీక మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీరుద్రేశ్వరస్వామి వారి వేయిస్తంభాల దేవాలయంలో స్వామివారిని మహాకాళేశ్వరుడిగా అలంకరించి అన్న పూజ నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యాన ఉదయం పూజల అనంతరం 51 కిలోల పెరుగన్నంతో మహాశివలింగాన్ని ఉజ్జయిని మహాకాళేశ్వరుడిగా అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులకు చిత్రాన్నప్రసాదం అందజేశారు. ఇదిలా ఉండగా.. కార్తీక మాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకొని నేడు స్వామివారికి మారేడు దళబిల్వార్చన, వనభోజనాలు, కార్తీక సమారాధన ఉంటుందని గంగు ఉపేంద్రశర్మ తెలిపారు.

నర్సంపేట కోర్టులో ఈ-సేవా కేంద్రం ప్రారంభం



ఈ-సేవా కేంద్రం ప్రారంభోత్సవంలో జిల్లా న్యాయమూర్తులు

నర్సంపేట రూరల్: నర్సంపేట కోర్టులో ఈసేవా కేంద్రాన్ని ఆదివారం సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి. నర్సింహారావు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాధే వర్చువల్‌గా ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మల గీతాంబ, వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సాయికుమార్, న్యాయమూర్తి చండీశ్వరీదేవి, నర్సంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుట్టపాక రవి, కార్యదర్శి సిలువేరు కిరణ్‌కుమార్, ఏజీపీలు సంజయ్‌కుమార్, శివ, న్యాయవాదులు కొమ్ము రమేశ్‌యాదవ్, మోటూరి రవి, నారగోని రమేశ్, ఠాకూర్, సునీత, బొట్ల పవన్, నాగుల రమేశ్, అశోక్, వీరేశ్, స్రవంతి, దాస్యం రంగనాథ స్వామి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం నర్సంపేట కోర్టు ఆవరణలోని మహిళా కారాగారాన్ని న్యాయమూర్తులు సందర్శించి అక్కడి మహిళా ఖైదీలతో మాట్లాడారు. ఖైదీల ఆరోగ్య, వ్యక్తిగత పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సలహాలు, సూచనల కోసం న్యాయ సేవాధికార సంస్థలను ఆశ్రయించాలన్నారు.

కలువల కనువిందు



కాళ్ల కింద నీళ్లు. తలపైన ఆకాశం. అందమైన ముఖారవిందం. ముట్టుకుంటే మాసిపోయే తెల్లదనం. అంతటి అందాలకు రక్షణ కవచంగా నిలిచింది జలాశయం. వెరసి.. కలువలు విరిశాయి. సుగంధాలు గుభాళించాయి. కాజీపేట సోమిడి చెరువులో విరగ బూసిన కలువలు ఆకట్టుకుంటున్నాయి.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హన్మకొండ

క్లుప్తంగా

ఆర్థిక ఇబ్బందులతో పెయింటర్ ఆత్మహత్య


బాలరాజు(ఫైల్)

ఐనవోలు : ఆర్థిక ఇబ్బందులు తాళ లేక పెయింటర్ ఉరే సుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని కొండపర్తిలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపిన కథనం ప్రకారం.. మాచర్ల బాలరాజు (48) పెయింటింగ్ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కుల వృత్తితో వచ్చే ఆదాయం సరిపోక పోవడంతో కుటుంబ పోషణకు అప్పులు చేశాడు. దీంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో గతంలో తన కున్న భూమిని అమ్మి కొంత మేర అప్పులు తీర్చాడు. మళ్లీ కుటుంబ నిర్వహణకు అప్పులు చేయగా తీర్చే మార్గం లేదని భార్యతో చెప్పుకుంటూ తరచూ బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో భార్య, కూతురు కలిసి వెతకగా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం గ్రామంలోని చెట్టుకు బాలరాజు ఉరేసుకుని కనిపించాడు. కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి చూడగా అప్పటికే మృతిచెందాడు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం తరలించారు. మృతుడికి భార్య శ్రీలత, కూతురు అఖిల ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపారు.

కంటి చికిత్స కోసం వెళ్లి.. కనిపించని లోకాలకు

- ఆస్పత్రిలో చిన్నారి మృతి
- శోకసంద్రంలో కుటుంబీకులు


హన్విక(ఫైల్)

చిన్నగూడూరు: కంటి చికిత్స కోసం వెళ్లిన ఓ చిన్నారి కనిపించని లోకాలకు తరలింది. వైద్యులు మోతాదుకు మించి అనస్థిషియా (మత్తు మందు) ఇవ్వడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లి మృతి చెందిందని బంధువులు ఆరోపించారు. వారి కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లి గ్రామానికి చెందిన రవి, మౌనిక దంపతులు కొన్నేళ్లుగా హైదరాబాద్‌లోని పటాన్‌చెరులో నివాసముంటున్నారు. నాలుగు రోజుల క్రితం తమ కుమార్తె హన్విక(6) ఆడుకుంటున్న సమయంలో కంటిలో కర్ర ముక్క గుచ్చుకుంది. దీంతో వైద్యం కోసం హైదరాబాద్‌లోని హబ్సిగూడ ప్రైవేట్ కంటి ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు మోతాదుకు మించి మత్తు మందు ఇవ్వడంతో అపస్మారక స్థితిలో వెళ్లిన చిన్నారి శుక్రవారం మృతి చెందింది. దీంతో ఆడుతూ పాడుతూ అల్లరి చేస్తున్న తమ గారాల పట్టీ ఒక్కసారిగా విగతాజీవిగా పడి ఉండడం చూసి తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. చిన్నారి మృతదేహాన్ని ఆదివారం స్వగ్రామం ఉగ్గంపల్లికి తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రెడ్యా నాయక్.. చిన్నారి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఇక.. అంతరాయానికి చెక్

కోతలు లేకుండా విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్వహణ

- మరమ్మతుల సమయంలో నో పవర్ కట్
- ప్రత్యామ్నాయ విద్యుత్ లైన్లు ఏర్పాటు
- హర్షం వ్యక్తం చేస్తున్న వినియోగదారులు

హన్మకొండ : కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా టీజీ ఎన్పీడీసీఎల్ ముందుకెళ్తోంది. ఇందులో భాగంగా సబ్ స్టేషన్‌ల నిర్వహణ, వాటి సామర్థ్యం పెంపునకు చేపట్టిన పనుల సందర్భంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రతి సబ్‌స్టేషన్‌కు ప్రత్యామ్నాయ విద్యుత్ లైన్లు వేశారు. మిగతా వాటికి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గతంలో సబ్ స్టేషన్ నెలవారీ నిర్వహణ (మరమ్మతు) చేసిన క్రమంలో 2 నుంచి 4 గంటల వరకు ఆ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ నిలిపి చేసేవారు. అదే విధంగా విద్యుత్ సబ్‌స్టేషన్ సామర్థ్యం పెంపునకు చేపట్టిన పనులు సందర్భంగా రెండు, మూడు రోజులు పగలంతా విద్యుత్ సరఫరా నిలిపి చేసేవారు. ఈ సమస్యను అధిగమించేందుకు, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు నివారించేందుకు టీజీ ఎన్పీడీసీఎల్ ప్రత్యామ్నాయ విద్యుత్ లైన్లు వేసింది. దీంతో విద్యుత్ అంతరాయాలు తగ్గాయి. కాగా, శనివారం వరంగల్ సర్కిల్ పరిధిలోని గొర్రెకుంట విద్యుత్ సబ్ స్టేషన్ నిర్వహణ పనులు చేశారు. అయినా ఈ సబ్‌స్టేషన్ పరిధిలోని వినియోగదారులకు విద్యుత్ సరఫరా అందించారు. ఇతర సబ్‌స్టేషన్ల నుంచి ఫీడర్‌ల వారీగా విద్యుత్ సరఫరా చేసి అంతరాయాలను నివారించారు.

సబ్‌స్టేషన్ల సామర్థ్యం పెంపు..

గొర్రెకుంట సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ లైన్‌లో 10 ఏబీ స్విచ్‌లు ఏర్పాటు చేసి ఇతర సబ్‌స్టేషన్‌ల ద్వారా విద్యుత్ అందించారు. ఈ సబ్‌స్టేషన్ ఇండస్ట్రియల్ ప్రాంతంలో ఉంది. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా పరిశ్రమలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా నిరంతరాయంగా విద్యుత్ అందించారు. దీంతో పాటు హనుమకొండ సర్కిల్ పరిధిలో వేసవి డిమాండ్‌ను తట్టుకునేందుకు ముందు జాగ్రత్త చర్యలో భాగంగా సబ్‌స్టేషన్‌ల సామర్థ్యాన్ని పెంచుతున్నారు. ఇటీవల హనుమకొండ నక్కలగుట్ట, యాదవ నగర్‌ల సబ్ స్టేషన్‌ల సామర్థ్యాన్ని పెంచారు. రెండు నుంచి మూడు రోజుల పాటు జరిగే ఈ పనులతో మామూలుగానైతే విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిపివేయాల్సి ఉంటుంది. ఈ సబ్ స్టేషన్ పరిధిలోని వినియోగదారులకు ఇతర సబ్‌స్టేషన్‌లకు అనుసంధానంగా వేసిన ప్రత్యామ్నాయ లైన్లు వేయడం ద్వారా ఎలాంటి అంతరాలు లేకుండా విద్యుత్ సరఫరా చేశారు. దీంతో ఎలాంటి విద్యుత్ కోతలు లేకుండానే ఇటు సబ్‌స్టేషన్‌ల సామర్థ్యం పెరిగింది. అటు వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరిగింది. ఈ విధానం అమలుపై వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గొర్రెకుంట సబ్‌స్టేషన్ మరమ్మతులు చేసినా ఎలాంటి అంతరాయాలు లేకుండా పరిశ్రమలకు విద్యుత్ సరఫరా చేయడంపై చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, కాటన్ అసోసియేషన్ అధ్యక్షుడు వీరారావు గొర్రెకుంటలో విద్యుత్ సబ్ స్టేషన్‌ను సందర్శించి విద్యుత్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.


హనుమకొండలోని యాదవనగర్‌లో సబ్‌స్టేషన్ సామర్థ్యం పెంపులో భాగంగా ఏర్పాటు చేసిన పవర్‌ట్రాన్స్‌ఫార్మర్

అంతరాయాలు లేని విద్యుత్ సరఫరా లక్ష్యం..



వినియోగదారులకు అంతరాయాలు లేని విద్యుత్ సరఫరా లక్ష్యంగా ఎన్పీడీసీఎల్ యాజమాన్యం అనేక చర్యలు తీసుకుంటుంది. సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి విద్యుత్ కోతలు తగ్గించడంపై ప్రత్యేక దృష్టి సారించారు. సీఎండీ ఆదేశాలు, సూచనల మేరకు వినియోగదారులకు ఆటంకాలు లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నాం.

– శెంకేశి మల్లికార్జున్, వరంగల్ టౌన్ డీఈ

అందుబాటులోకి ప్రత్యామ్నాయ విద్యుత్ లైన్లు..



వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా ప్రత్యామ్నాయ విద్యుత్ లైన్లు వేస్తున్నాం. ఏదేని సబ్‌స్టేషన్‌లో సమస్య ఉత్పన్నమైనప్పుడు, మరమ్మతులు చేసినప్పుడు, అప్‌గ్రేడ్ పనులు జరిగినప్పుడు విద్యుత్ కోతలు ఉండకుండా ప్రత్యామ్నాయ లైన్ల ద్వారా విద్యుత్ సరఫరా చేస్తున్నాం.

– జి.సాంబ రెడ్డి, హనుమకొండ టౌన్ డీఈ

న్యాయబద్ధంగా వర్గీకరణ చేపట్టాలి

- లంబాడీ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు దాస్ రామ్‌నాయక్

నర్సంపేట: ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణను న్యాయబద్ధంగా చేపట్టి అన్ని వర్గాలకు సమన్యాయం చేయాలని లంబాడీ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు దాస్ రామ్‌నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు నర్సంపేట పట్టణంలోని సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో ఆదివారం మానవ హక్కుల వేదిక 10వ జిల్లా మహాసభ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు అద్దనూరి యాదగిరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ వచ్చిన తర్వాత రాష్ట్రంలో విచిత్ర పరిస్థితి నెలకొందన్నారు. రాష్ట్రంలో అధికార పక్షం, విపక్షం ఉన్నా ప్రజాపక్షమే లేదని దుయ్యబట్టారు. ప్రజా పక్షం మాట్లాడే వారందరినీ ప్రభుత్వాలు బెదిరించి తమ పక్షాల్లో చేర్చుకుని ప్రజలకు ఒక గొంతుక లేకుండా చేస్తున్నాయని వాపోయారు. మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.తిరుపతయ్య మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజల కీలక సమస్య రంగయ్య చెరువును రిజర్వాయర్‌గా మార్చే ప్రక్రియను వెంటనే మానుకోవాలని డిమాండ్ చేశారు. రంగయ్య చెరువు రిజర్వాయర్ వ్యతిరేక పోరాట కమిటీ నాయకుడు గూబ రాజు మాట్లాడుతూ ఎవరూ కోరుకోని.. ఎవరికీ ఇష్టం లేని ప్రాజెక్టును ఎందుకు చేపడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ పి.జగదీశ్వర్, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్ మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా అభివృద్ధి అంటే రోడ్లను విస్తరించడం, అవసరం లేకపోయినా ప్రాజెక్టులను నిర్మించడం, ప్రైవేట్ సంస్థలకు బలవంతంగా ప్రజల నుంచి భూములను లాక్కొని కట్టబెట్టడమేనన్నారు. గత ప్రభుత్వం మల్లన్న సాగర్ లాంటి ప్రాజెక్టుల కోసం బలవంతంగా ఊళ్లకు ఊళ్లను ముంచి ప్రజలను దిక్కులేని వాళ్లను చేసిన భయంకరమైన జ్ఞాపకాలను ప్రజలు మరచిపోలేదన్నారు. ఇక ఇలాంటి బలవంతపు భూసేకరణలు ఆగిపోతాయని ఆశిస్తూ ఎన్నుకున్న కొత్త ప్రభుత్వం కూడా అదే బాటలో నడవడం లగచర్లలో రుజువైందన్నారు. ఇలాంటి అభివృద్ధి నమూనాను ప్రభుత్వాలు వెంటనే మానుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాదావత్ రాజు, రాష్ట్ర కార్యదర్శి టి.హరికృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి వి.దిలీప్, కార్యదర్శులు జి.పద్మజ, పి.శ్రీనివాస్, సభ్యులు ఎ.శ్రీనివాస్, వి.వెంకటనారాయణ, పొన్నాల రమేశ్, కర్ణాటక సమ్మయ్య, ఉయ్యాల సురేందర్, గణేశ్, రంగయ్య చెరువు పోరాట కమిటీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దాస్ రామ్‌నాయక్

30న న్యాయవాదుల సంఘం రాష్ట్ర మహాసభలు

హన్మకొండ : హనుమకొండలో ఈనెల 30, డిసెంబర్ 1వ తేదీల్లో భారత న్యాయవాదుల సంఘం తెలంగాణ రాష్ట్ర ద్వితీయ మహాసభలు నిర్వహించనున్నట్లు సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ తెలిపారు. ఆదివారం హనుమకొండ నక్కలగుట్టలోని హరితకాకతీయ హోటల్‌లో భారత న్యాయవాదుల సంఘం సన్నాహాక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రభాకర్ మాట్లాడుతూ దేశ రాజ్యాంగ మౌలిక లక్ష్యాల అమలు, న్యాయవ్యవస్థలో న్యాయవాదుల, లా విద్యార్థుల భవిష్యత్, సామాజిక న్యాయ లక్ష్యాలు వంటి అంశాలతో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ సంఘాన్ని స్థాపించినట్లు వివరించారు. నేడు దేశం, రాష్ట్రంలో న్యాయవాదులపై దాడులు, హత్యలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయవాదులకు రక్షణ చట్టాన్ని అమలు చేయాల్సిన అవసరముందన్నారు. మహాసభ ఆహ్వాన సంఘం చైర్మన్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు దుస్సా జనార్దన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి భీమనాదం శ్రీనివాస్, ప్రతినిధులు ప్రేమ్‌సాగర్‌రావు, సుధీర్, బిల్లా ప్రభాకర్, గంజి గణేశ్, వల్లీఉల్లాఖాద్రీ, కొత్తపల్లి చిరంజీవి, మెరుగు సుభాష్, సత్యనారాయణ, దిలీప్, భానుకార్తీక్, కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆహ్వాన కమిటీ ప్రతినిధులు

డిగ్రీ పరీక్షలపై అయోమయం

- వెబ్‌సైట్‌లో 138 కళాశాలల విద్యార్థుల హాల్‌టికెట్‌లు మాత్రమే..
- కనిపించని ఫీజులు చెల్లించని కళాశాలలకు సంబంధించిన హాల్‌టికెట్లు
- నేడు ప్రైవేట్ యాజమాన్యాలు వీసీని కలిసే అవకాశం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధి ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలోని డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ మొదటి, మూడో, ఐదవ సెమిస్టర్ల పరీక్షల నిర్వహణపై అయోమయం నెలకొంది. ఈనెల 26 నుంచి పరీక్షలు నిర్వహిస్తామని అధికారులు చెబుతున్నా.. పరీక్షలు వాయిదా వేయాల్సిందేనని ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు యూనివర్సిటీ అధికారులు దృష్టికి తీసుకెళ్లాయి. తమకు ప్రభుత్వం ఫీజురీయింబర్స్‌మెంట్ చెల్లించడం లేదని, దీంతో తాము ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఈ నేపథ్యంలో యూనివర్సిటీకి ఫీజులు కూడా చెల్లించే పరిస్థితి లేదంటున్నారు.

పరీక్షల వాయిదాకు ససేమిరా అంటున్నా నిర్వహించే పరిస్థితి ఏదీ!

పరీక్షలు వాయిదా వేసే పరిస్థితి లేదని కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి నర్సింహాచారి తెలుపుతున్నా ఆదివారం వరకు విద్యార్థులకు హాల్‌టికెట్లు అందలేదు. యూనివర్సిటీ పరిధిలో 290 వరకు అన్ని యాజమాన్యాలు కలిపి డిగ్రీ కళాశాలలుండగా ఆదివారం వరకు కేవలం 138 కళాశాలలకు సంబంధించిన విద్యార్థుల హాల్‌టికెట్లు సంబంధిత కేయూ వెబ్‌సైట్‌లో అంటే కళాశాలలు లాగిన్ అయి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకొని విద్యార్థులకు ఇవ్వాల్సింటుంది. ప్రభుత్వ, గురుకుల కళాశాలలు డౌన్‌లోడ్ చేసుకుంటున్నప్పటికీ ప్రైవేట్ కళాశాలలు యూనివర్సిటీకి వివిధ ఫీజులు చెల్లించకపోవడంతో వారి హాల్‌టికెట్లు సంబంధిత వెబ్‌సైట్‌లో అందుబాటులో పెట్టలేదని తెలుస్తోంది. ఎవరైతే ఫీజులు చెల్లించారో ఆ ప్రైవేట్ కళాశాలల హాల్‌టికెట్లు అందుబాటులో ఉంచినా వారు కూడా డౌన్‌లోడ్ చేసుకోవడం లేదు. యూనివర్సిటీకి ఫీజు చెల్లించకపోతే వారికి హాల్‌టికెట్లు జారీచేయొద్దని రిజిస్ట్రార్ మల్లారెడ్డి పరీక్షల విభాగం అధికారులను ఆదేశించారని సమాచారం. ఈ నేపథ్యంలో ఈపరీక్షలు ఈనెల26నుంచి నిర్వహించడం సాధ్యం కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నేడు వీసీని కలవనున్న యాజమాన్యాలు

ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాల యాజమాన్యాల అసోసియేషన్ బాధ్యులు సోమవారం కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రతాప్‌రెడ్డిని కలవబోతున్నారు. ఈనెల26 నుంచి తాము పరీక్షల నిర్వహణకు సిద్ధంగా లేమని, కనీసం వారం రోజులు వాయిదా వేయాలని కోరబోతున్నట్లు సమాచారం. కాగా, డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలు 68,270 మంది, మూడో సెమిస్టర్ 58,630 మంది, ఐదో సెమిస్టర్ 45,853 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉంది.

సాయిబాబా ఆశయాలను కొనసాగించాలి

- సంస్మరణ సభలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

కేయూ క్యాంపస్: ప్రొఫెసర్ సాయిబాబా ఆశయాలు కొనసాగించాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. ప్రజాస్వామిక, వామపక్ష, లౌకిక వాదుల ప్రజాసంఘాల ఐక్యవేదిక ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్అండ్ సైన్స్ కాలేజీలో ఘంటా రాంరెడ్డి అధ్యక్షతన జరిగిన ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇతరులకు మంచి చేయాలనే ఉద్దేశంతోనే ముందుకెళ్తున్న సాయిబాబాది మాములు మరణం కాదని, కార్పొరేట్ శక్తులకు వత్తాసుపలికే ప్రభుత్వమే సాయిబాబాను హత్యచేసిందని భావిస్తున్నామన్నారు. వీక్షణం ఎడిటర్ ఎన్. వేణుగోపాల్ మాట్లాడుతూ సాయిబాబా జీవితమే పోరాట సందేశమన్నారు.ఆయన ఎప్పుడు విప్లవోద్యమ పక్షాన ఉండిపోరాటం చేశారన్నారు. కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ కాత్యాయనీవిద్మహే మాట్లాడుతూ పుట్టుక నీది చావునీది బతుకంతా దేశానిది అన్న కాళోజీ మాటలు సాయిబాబాకు అక్షరాల వర్తిస్తాయని అభిప్రాయపడ్డారు. ప్రొఫెసర్ సాయిబాబా కూతురు మంజీరా మాట్లాడుతూ నాన్న జైలులో ఉన్నప్పుడు తనకు ఎప్పుడు ఉత్తరం రాసినా ధైర్యం వచ్చేదన్నారు. సామాజిక విశ్లేషకుడు రవిచందర్.. సాయిబాబా బాల్యం, విద్యాభ్యాసం, ఉద్యమ జీవితాన్ని వివరించారు. డీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి, లాల్‌నీల్‌మైత్రి వేదిక రాష్ట్ర నాయకుడు మార్క్స్‌శంకర్‌నారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంగళ్‌రెడ్డి, భారత్‌బచావో హనుమకొండ జిల్లా చైర్మన్ సిద్ధోజు రామబ్రహ్మం, పౌరహక్కుల సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు రమేశ్ చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

సీఎంతో మాట్లాడి న్యాయం చేస్తాం

- ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్


బాధిత కుటుంబాలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట్రావ్

వాజేడు: మావోయిస్టుల చేతిలో హత్యకు గురైన ఉయికె రమేశ్, ఉయికె అర్జున్ కుటుంబాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడి న్యాయం చేస్తానని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ భరోసా ఇచ్చారు. ములుగు జిల్లా వాజేడు మండల పరిధి పెనుగోలు కాలనీకి ఆదివారం వచ్చిన ఆయన బాధిత కుటుంబాలను ఓదార్చారు. జరిగిన సంఘటన గురించి రమేశ్ భార్య రాంబాయి, అర్జున్ భార్య సావిత్రిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారితో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇరు కుటుంబాలకు అండగా ఉంటామని, ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక సహాయాన్ని త్వరలో ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ఇరు కుటుంబాల్లో ఒక్కొక్కరికి ప్రభుత్వ ఉద్యోగం వచ్చేలా చూస్తామని చెప్పారు. ప్రస్తుత అవసరాల నిమిత్తం కొంత నగదును ఆయన అందజేశారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దంతులూరి విశ్వనాథ ప్రసాద్‌రాజు, ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్, సాయి కల్యాణ్, ఖాజావలీ, కాళీ, ఎల్లయ్య, రాంబాబు తదితరులున్నారు.

ఖమ్మానిదే నెట్‌బాల్ ట్రోఫీ..

- బాల,బాలికల విభాగంలో ప్రథమస్థానం సాధించిన జట్లు
- ద్వితీయ స్థానాల్లో నల్లగొండ, వరంగల్ జిల్లాల జట్లు
- కల్వలలో ముగిసిన రాష్ట్రస్థాయి పోటీలు


ఖమ్మం బాలికల జట్టుకు ప్రథమ బహుమతి అందజేస్తున్న డీఎస్పీ, మార్కెట్ చైర్మన్

కేసముద్రం: మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కల్వల గ్రామ జెడ్పీహైస్కూల్‌లో నిర్వహించిన 68వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి బాల, బాలికల(అండర్ -17) నెట్‌బాల్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీల్లో బాలికల విభాగంలో ఖమ్మం జట్టు ప్రథమస్థానంలో నిలిచింది. నల్లగొండ ద్వితీయస్థానం, వరంగల్ తృతీయస్థానంలో నిలిచాయి. బాలుర విభాగంలో ఖమ్మం జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. వరంగల్ ద్వితీయ స్థానం, నల్లగొండ తృతీయస్థానంలో నిలిచాయి. మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు, కేసముద్రం మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి.. విజేతలకు మెడల్స్, షీల్డ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే చదువుతోపాటు, క్రీడలపై శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం ఇదే పాఠశాల ఆవరణలో ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి గట్కా పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్సై మురళీధర్‌రాజు, కేసముద్రం సొసైటీ వైస్ చైర్మన్ అంబటి మహేందర్ రెడ్డి, డీవైఎస్‌ఓ జ్యోతి, ఎస్‌జీఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, గట్కా స్టేట్ సెక్రటరీ విశాల్‌సింగ్, హెచ్‌ఎంలు బండారు నరేందర్, కల్లెం వీరారెడ్డి, బండారు వెంకన్న, పీడీలు, టోర్నమెంట్ నిర్వాహకులు, కోచ్‌లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేత వాగ్దేవి కళాశాల

- రన్నరప్‌గా ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ
- ముగిసిన ఇంటర్ కాలేజీయెట్ పోటీలు


వాగ్దేవి కళాశాల జట్టుకు బహుమతి అందజేస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి తదితరులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని క్రీడా మైదానంలో ఇంటర్ కాలేజీయెట్ క్రికెట్‌పోటీలు(పురుషుల) ఆదివారం ముగిశాయి. ఫైనల్‌లో వాగ్దేవి డిగ్రీ కళాశాల, యూనివర్సిటీ ఆర్ట్స్అండ్ సైన్స్ కాలేజీ జట్లు తలపడ్డాయి. ఇందులో వాగ్దేవి డిగ్రీ కళాశాల గెలుపొందగా ఆర్ట్స్అండ్ సైన్స్ కాలేజీ రన్నరప్‌గా నిలిచింది. కేయూ రిజిస్ట్రార్ పి. మల్లారెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు తమకు ఇష్టమైన క్రీడలపై ఆసక్తి పెంచుకుని రాణించాలన్నారు. కార్యక్రమంలో కేయూ స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ ఆచార్య వెంకయ్య, వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి. హరేందర్‌రెడ్డి, కొమురారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ మహ్మద్ అఫ్జల్, ఫిజికల్ డైరెక్టర్లు డాక్టర్ భాస్కర్, మధుకర్, పల్లెపు కిషన్, బత్తిని జీవన్, మోహన కృష్ణ, మట్టెడ కుమార్, అస్లాం పాల్గొన్నారు. ఎంపైర్లుగా ప్రభాకర్, వేల్పుల సురేశ్ వ్యవహరించారు. కాగా, క్రీడాకారులను వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చందుపట్ల దేవేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శేషాచలం అభినందించారు.

హెచ్‌ఎంలకు బోధనేతర పనులు అప్పగించొద్దు

- హెచ్‌ఎంల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రప్రకాశ్


రవీందర్


సుధాకర్‌రావు

విద్యారణ్యపురి: ప్రభుత్వ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలకు బోధనేతర పనులు అప్పగించొద్దని, వివిధ కారణాలతోఏకపక్షంగా సస్పెన్షన్‌లు చేయొద్దని తెలంగాణ గెజిటెడ్ హెచ్‌ఎంల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి. రాజభాను చంద్రప్రకాశ్ డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండలోని ప్రభుత్వప్రాక్టిసింగ్ పాఠశాలలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మధ్యాహ్నం భోజన నిర్వహణ, డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల తనిఖీ విషయంలో హెచ్‌ఎంలను బాధ్యులను చేయడం సరికాదన్నారు. అనంతరం వరంగల్ జిల్లాశాఖ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్. రవీందర్, ప్రధాన కార్యదర్శిగా ఎల్. సుధాకర్, కోశాధికారిగా మహేశ్, రాష్ట్ర కౌన్సిలర్లుగా జి. కృష్ణమూర్తి, బి.పరమేశ్వర్ ఎన్నికయ్యారు. మాజీ జిల్లా అధ్యక్షుడు రాజాక్, ప్రధాన కార్యదర్శి సదా శివరావు నివేదిక సమర్పించారు. ఈ సమావేశంలో సీనియర్ హెచ్‌ఎం పట్టాభి, జిల్లా సైన్స్‌అధికారి కట్ల శ్రీనివాస్, గెజిటెడ్ హెచ్‌ఎంల సంఘం హనుమకొండ జిల్లాశాఖ అధ్యక్షుడు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి యువకుడి మృతి


రాంబాబు (ఫైల్)


రఘునాథపల్లి: బైక్ అదుపు తప్పిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ప్రమాదం జనగామ మండలం యశ్వంతాపూర్ బీఫార్మసీ కళాశాల ఎదుట జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం గబ్బెట గ్రామానికి చెందిన రంగు యాదగిరి, ఆల్య దంపతుల కుమారుడు రాంబాబు (28) ట్రాలీలో అంగన్‌వాడీ కేంద్రాలకు కోడి గుడ్లు సప్లయ్ చేస్తుంటాడు. శనివారం పనులు ముగించుకుని తన ద్విచక్రవాహనంపై రాత్రి 9 గంటల సమయంలో ఇంటికి బయలుదేరాడు. యశ్వంతాపూర్ బీఫార్మసీ కళాశాల వద్దకు చేరుకున్న సమయంలో బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. దీంతో తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు గుర్తించి 108లో జనగామ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై మృతుడి సోదరుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జనగామ పోలీసులు తెలిపారు. కాగా, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఆదివారం గబ్బెట గ్రామానికి చేరుకుని రాంబాబు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు..

దుగ్గొండి : రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధుడిని వెనక నుంచి ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో వృద్ధుడు మృతిచెందిన సంఘటన మండలంలోని గిర్నిబావిలో జరిగింది. నర్సంపేట మండలం ముత్తోజీపేటకు చెందిన బోళ్ల ఐలయ్య(80) దుగ్గొండి మండలం గిర్నిబావిలోని తన కూతురు జయమ్మ ఇంటికి శనివారం వచ్చాడు. ఆదివారం గిర్నిబావి నుంచి ముత్తోజీపేటకు బయలుదేరాడు. ఈ క్రమంలో గిర్నిబావి నుంచి నడుచుకుంటూ వెళ్తున్న ఐలయ్యను వరంగల్ నుంచి వస్తున్న గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించగా మృతి చెందాడు. ద్విచక్ర వాహనదారుడి వివరాలు తెలియరాలేదు. మృతుడికి భార్య, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు.

లారీ సప్లయర్స్ సంక్షేమమే ధ్యేయం

- నూతన అధ్యక్షుడు వంగల సమ్మిరెడ్డి


ప్రమాణ స్వీకారోత్సవంలో నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న సప్లయర్స్ సభ్యులు

ఖిలా వరంగల్: ది వరంగల్ జిల్లా లారీ సప్లయర్స్ అసోసియేషన్ సభ్యుల సంక్షేమమే ధ్యేయంగా కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు వంగల సమ్మిరెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం వరంగల్ ఆర్టీఏ సమీపంలోని ఉమ్మడి జిల్లా లారీ సప్లయర్స్ అసోసియేషన్ భవనంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. అధ్యక్షుడు వంగల సమ్మిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కొండ సత్యనారాయణ, కోశాధికారి దాసరి నాగరాజు, ఉపాధ్యక్షుడు సయ్యద్ హిమాయతుల్లా(బాబర్), సహాయ కార్యదర్శి మందాటి రవీందర్, సభ్యులు బాసాని రామకృష్ణ, తాళ్లకుమార్ ప్రమాణం చేశారు. అనంతరం సమ్మిరెడ్డి మాట్లాడుతూ.. నిరంతరం సభ్యులకు అందుబాటులో ఉంటూ వారి అభ్యున్నతికి పాటుపడతానని అన్నారు. కార్యక్రమంలో ఎన్నిక అధికారులు, అడ్‌హక్ కమిటీ ప్రతినిధి మింగని సదానందం, తోట దేవేందర్, వెలిశాల శ్రీనివాస్, కందిమల్ల భాస్కర్‌రావు, ఇంజమూరి సూర్య నారాయణ తదిరులు పాల్గొన్నారు.